క్లుప్తంగా

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అవసరాల మేరకు కెనరా బ్యాంక్ నిడదవోలు బ్రాంచి సహకారంతో బుధవారం స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఉపేంద్ర, మేనేజర్ ఇ.సమంతరాయ్, చంద్ర మౌళి, హెచ్ఎం గురునాథం, ఉపాధ్యాయులు బొ.సత్యనారాయణ, ఇ.పద్మజ, ఒ.బుజ్జిబాబు, ఇ.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

దేవరపల్లి: శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా దేవరపల్లిలోని ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్నదానం చేశారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

దేవరపల్లి: స్థానిక శ్రీకృష్ణయాదవ సంఘం సామాజిక భవన నిర్మాణానికి బుధవారం ఎంపీపీ కేవీకే దుర్గారావు శంకుస్థాపన చేశారు. యాదవ సంఘానికి సామాజిక భవన నిర్మాణానికి మూడు సెంట్లు స్థలం, మండల పరిషత్ నిధుల నుంచి రూ.6 లక్షలు మంజూరు చేసినట్టు ఎంపీపీ దుర్గారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షులు కామిశెట్టి దుర్గారావు, యాదవ సంఘం అధ్యక్షులు గోపనబోయిన సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జమ్మి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

గుబ్బాలమ్మ హుండీ ఆదాయం రూ.1,82,397



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిడదవోలు రూరల్: గోపవరం గ్రామంలో ఉన్న గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ హుండీని బుధవారం లెక్కించినట్లు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాష్ తెలిపారు. దేవదాయశాఖ తాడేపల్లిగూడెం ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో గుబ్బాలమ్మ ఆలయ హుండీని లెక్కించగా 120 రోజులకు రూ.1,82,397 ఆదాయం వచ్చినట్లు ఆయన చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి

ఉండ్రాజవరం : ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకారం అందిచాలని ఎస్సై వి.అప్పలరాజు కోరారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఉండ్రాజవరంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహించారు.

బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై

ఉండ్రాజవరం: విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్సై వి.అప్పలరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19 వతేదీన జరిగిన ప్రజ్ఞా వికాస పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ పరీక్షలో మొదటి స్థానంలో కె.పావణి దుర్గాంబ, ద్వితీయ స్థానంలో ఆర్.మౌనిక, తృతీయ స్థానంలో పి.మహేష్‌బాబుతో పాటు మిగిలిన ఏడుగురు విద్యార్థులకు ఎస్సై అప్పలరాజు, ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం.విశ్వనాథం, దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు వి.సత్య ప్రసన్న కుమార్, పి.గణేష్, వెంకటేష్, సిద్దు, విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం పట్టుకున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

గోపాలపురం: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నట్టు గోపాలపురం ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణా రాష్ట్రం సత్తుపల్లి నుంచి రాజమహేంద్రవరం అక్రమంగా తరలిస్తున్న ఏపీ 05 టీయూ 4356 నంబర్ గల వ్యాన్‌లో 130 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు, రెవెన్యూ అధికారులకు వచ్చిన సమాచారం ప్రకారం తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. బియ్యం విలువ రూ.2లక్షలు ఉంటుందన్నారు. తనిఖీల్లో కాకినాడ జిల్లా పిఠాపురం మండలానికి చెందిన లారీ డ్రైవరు అల్లు మల్లు రామును అదుపులోకి తీసుకొన్నట్టు చెప్పారు. పట్టుకున్న బియ్యం లారీని సివిల్ సప్‌లై డీటీకి అప్పగించినట్టు తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

- ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావాలి
- ఆత్మీయ సమావేశంలో హోంమంత్రి తానేటి వనిత



జగన్నాథపురం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల: ఈ రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందించి మన కుటుంబాలలో ఉన్న పేదరికాన్ని దూరం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. జగన్నాథపురంలో సర్పంచ్ చెల్లారి రామశ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతన్నలందరూ సంతోషంగా వ్యవసాయం చేసేలా వ్యవసాయాన్ని పండగల చేశాసారన్నారు. గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలందేలా సచివాలయాలు, వలంటీలర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చారన్నారు. ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రిని మనం ప్రతిపక్షాల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు బుంగా సుబ్బారావు, ఉపసర్పంచ్ గుదే వెంకట్రావు, ఎంపీటీసీ కాకర్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెల్లమూడిలో..

మార్కెల్లమూడిలో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను మంత్రి ప్రారంభించారు. సర్పంచ్ ప్రగడ సుబ్రమణ్వేశ్వరి, ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి, ప్రగడ వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు రాంపండు తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ మంత్రి వనిత ఫ్లెక్సీకి అభిమానులు క్షీరాభిషేకం చేశఋరు.

ముసుళ్లగుంటలో ..

ముసుళ్లగుంటలో 40వేల లీటర్ల మంచినీటి ట్యాంకును, పోతవరం బీసీ ఏరియాలో రూ.20లక్షలు (ఎంపీనిధులు)లతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాలును మంత్రి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో మండలక న్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, ముప్పిడి వెంకట రత్నం, కరుటూరి లక్ష్మీగణేశ్వరావు, పిచ్చుకుల ప్రసాద్, బొప్పన సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ.. ధర బాగుందమ్మ..

- ఆశాజనకంగా నిమ్మకాయల ధర
- కిలో రూ.60
- యాదవోలు మార్కెట్‌కు భారీగా వస్తున్న కాయలు
- గిట్టుబాటు ధరతో రైతుల ఆనందం



దేవరపల్లి మండలం యాదవోలు మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

దేవరపల్లి: నిమ్మకాయల ధర ఆశాజనకంగా ఉంది. రోజురోజుకు పెరుగుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరిలో కిలో రూ.55 ఉన్న ధర ప్రస్తుతం రూ.60 పలుకుతోంది. ఈ ధర ఈ నెలాఖరుకు రూ.100 అవుతుందని వ్యాపారులు అంటున్నారు. దేవరపల్లి మండలం యాదవోలు మార్కెట్‌కు నిమ్మకాయలు భారీగా వస్తున్నాయి. రోజుకు 1200 బస్తాల కాయలు అమ్మకానికి వస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు. యాదవోలు మార్కెట్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నిమ్మకాయలు ప్రతి రోజు ఎగమతి చేస్తారు. ఇక్కడ మార్కెట్‌కు చుట్టుపక్కల ఐదు మండలాల నుంచి రైతులు నిమ్మకాయలను తీసుకువచ్చి గిట్టుబాటు ధరకు అమ్ముకుంటారు.

చిగురిస్తున్న ఆశలు

ఈ ఏడాది నిమ్మపంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. మార్కెట్ ధర కూడా బాగుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు పండించిన పంటకు గిరాకీ ఉంటుంది. వేసవి కావడంతో నిమ్మకాయలకు డిమాండ్ ఉంటుంది. ఈ సీజన్‌లో వచ్చిన ధర రైతులకు గిట్టుబాటు అవుతుంది. ఏడాది పొడవునా పంట దిగుబడి వస్తున్నప్పటికి శీతాకాలం, వర్షాకాలంలో నిమ్మ వినియోగం తక్కువగా ఉంటుంది. ఆయా సీజన్లలో పండిన పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర రానిపరిస్థితి. ఏడాదికి మూడు కాపులు వస్తాయి. నిమ్మసాగు చేస్తున్న రైతుల్లో ఎక్కువ మంది సన్నచిన్నకారు, కౌలు రైతులు ఉన్నారు. మెట్ట ప్రాంంలోని దేవరపల్లి, కొయ్యలగూడెం, గోపాలపురం, నల్లజర్ల, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో నిమ్మసాగు చేస్తున్నారు. ఎకరాకు 60 నుంచి 100 బస్తాల దిగుబడి వస్తోంది. బస్తాకు 50 కిలోలు చొప్పున నింపి రైతులు మార్కెట్‌కు తీసుకువస్తారు.

ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే..



కె.సావరంలో గ్రామ సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



వేగేశ్వరపురంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకటరావు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ
- ఇంటి స్థల హక్కు పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ఉండ్రాజవరం: మన రాష్ట్రంలో ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే అందుతున్నాయని, ఈ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలో కె.సావరం గ్రామంలో సుమారు రూ.79.94 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్ర భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలందిస్తున్నారు. ఉండ్రాజవరం గ్రామంలో సుధీంద్రబాబు కల్యాణ మండపంలో వేలివెన్ను, కాల్దారి, సత్యవాడ, చిలకపాడు, పసలపూడి గ్రామాల్లో అర్హులైన 311 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ భూహక్కు పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, మండల జేసీఎస్ కన్వీనర్ కఠారి సిద్దార్ధరాజు, పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, బస్వా రామన్నరావు, ఉనమట్ల అయ్యప్ప, మీసాల సురేష్, వర్రే రమేష్, బస్వా సర్వేశ్వరరావు, బస్వా శ్రీనివాసు, సఖినాల సత్యనారాయణ, సఖినాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నేరవేర్చిన జగన్

తాళ్లపూడి: పేదింటి అక్క చెల్లమ్మల కల సొంతింటి కలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వేగేశ్వరపురంలోని డీవీవీ దానయ్య గార్డెన్ వద్ద మండల స్థాయి ఇంటి హక్కు పత్రాలు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకటరావు చేతుల మీదుగా 1337 మందికి మహిళలకు ఇంటి స్థల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తలారి వెంకటరావు మాట్లాడుతూ మహిళలకు సంపూర్ణ హక్కులతో సచివాలయం వద్దే రిజిస్ట్రేషన్ చేయించి మండలంలో 1500 మందికి పట్టాలను అందజేస్తున్నట్టు తెలిపారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, తహసీల్దార్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచులు కొమ్మిరెడ్డి పరశురామారావు, గండి రాంబాబు, ఎల్లిన శివ, తిగిరిపల్లి వెంకటరావు, నాయకులు కుంటముక్కల కేశవనారాయణ, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, యాళ్ల బాబూరావు, పిట్టా శ్రీను, వల్లభశెట్టి శ్రీనివాస్, చిన్ని, నక్కా చిట్టి బాబు, ముళ్ల పోశిబాబు, వెంకన్నబాబు, లక్ష్మణరావు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల నిర్మాణం

రూ.47లక్షలతో నిర్మాణ పనులు



గోపాలపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోపాలపురం: రూ.47లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టినట్లు గోపాలపురం సొసైటీ చైర్మన్ కూసం రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు బుధవారం పలు సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధుల నుంచి రూ.23 లక్షలు, గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ.4లక్షల వ్యయంతో అత్యవసర రోడ్లు నిర్మాణాలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి, ముద్దన మురళీ, వార్డు సభ్యులు యాళ్ల శ్రీనివాసరావు, వారపు శశికుమార్, ముల్లంగి సుబ్బారెడ్డి, నాయకులు వింజమూరి సుబ్బారావు, కాలువ శ్రీను పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు తపస్వీరెడ్డి

నిడదవోలు: పట్టణానికి చెందిన కుంచాల తపస్వీరెడ్డి వియాత్నం దేశంలోని హనోయిలో గరగనునున్న అంతర్జాతీయ మోడల్ యునైటెడ్ నేషన్స్‌లో పాల్గొనేందుకు ఎంపికయ్యాడు. ఈ నెల15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు హనోయిలో యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యూఎన్‌హెచ్‌సీఆర్)వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తపస్వీరెడ్డి యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(యూఎన్‌డీపీ) కమిటీ డెలిగేట్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారు. అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు విద్యార్థులకు ఐక్యరాజ్య సమితి కార్యకలాపాలు నిర్వహించేలా, ప్రపంచంలోని దేశాలకు సంబంధించిన సమస్యలపై చర్చించడంలో పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న తపస్వీరెడ్డి మైనర్ కావడంతో తన తండ్రి శ్రీనివాసరెడ్డికి కూడా వీసా మంజేరు చేశారు. తపస్వీరెడ్డి అతి పిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం రావడంతో పట్టణ ప్రముఖులు పలువురు అభినందించారు.

రూ.1.40 కోట్లతో పట్టణ పోలీసు స్టేషన్ నిర్మాణం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వనిత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- హోమ్ మంత్రి తానేటి వనిత
- కొవ్వూరులో నూతన భవనానికి శంకుస్థాపన

కొవ్వూరు: పట్టణంలో రూరల్ పోలీసు స్టేషన్ పక్కనున్న సబ్‌జైలు ప్రాంగణంలో రూ.1.40 కోట్ల వ్యయంతో అధునాతన హంగులతో నిర్మించనున్న పట్టణ పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ గతంలో కేటాయించిన స్థలాన్ని సబ్ జైలుకి బదలాయించి, రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలోనే అన్ని హంగులతో పట్టణ పోలీసు భవనం నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. ఈ స్టేషన్ మెడల్ పోలీసు స్టేషన్‌గా నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ఏళ్ల తరబడి సొంత భవనం లేని పట్టణ పోలీసు స్టేషన్‌కి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి వనిత చొరవతో నూతన భవనం నిర్మాణానికి నిధులు సమకూర్చడం హర్షణీయమన్నారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, డీఎస్పీ కె.సీహెచ్ రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ గంధ్రోతు అంజనీ దేవి, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి శ్రీనివాస్, గోపాలపు రం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, మాజీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్రప్రసాద్, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, ముదునూరి నాగరాజు, కంఠమణి రమేష్ బాబు, తోట రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వర రావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి



సీఎం లేఖలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, వలంటీర్లు

నిడదవోలు: నిరుపేదలకు నవరత్న పథకాలతో ఆర్థిక ఆసరా కల్పించాలని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా ప్రజా ప్రయోజన పథకాలు అమలు చేశారని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి అన్నారు. పట్టణంలోని నాలుగో వార్డులో బుధవారం కులం, మతం, ప్రాంతం, రాజకీయ నేపథ్యం చూడకుండా ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబం ఏ మేరకు లబ్ధి పొందారో గుర్తు చేసేందుకు సీఎం వైఎస్ జగన్ పంపించిన చెప్పాడంటే- చేస్తాడంతే పేరిట ప్రతి కుటుంబం పొందిన లబ్ధిని వివరిస్తూ రూపొందించిన సీఎం లేఖలను పట్టణంలో నాలుగో వార్డులో బుధవారం గడపగడపకూ అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎస్కే ఖాన్‌బాషా, పార్టీ బీసీ నాయకుడు గంగుల గోపియాదవ్, గృహసారధులు పెద్దిరత్న, తోట ఉమాశంకర్, కట్టా నాగలక్ష్మీ వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక చేయూత



ఉండ్రాజవరంలో మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్



చిక్కాలపాలెంలో నూతన సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి



నల్లాకులవారిపాలెంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వరుణ్ సాయి

ఉండ్రాజవరం: మహిళా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఉండ్రాజవరంలో సుధీంద్రబాబు కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం జరిగిన వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్టీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఉండ్రాజవరం మండలంలో 3,633 మంది మహిళలకు రూ.6.82 కోట్లు చెక్కును అందజేశారు. ముందుగా వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, మండల సమైఖ్య అధ్యక్షురాలు కె.సుజాత, సెక్రటరీ ఉప్పలపాటి సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు వెంకట్రావు, శ్రీనివాస్, ఏపీఎం కె.వేణు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెరవలి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు కుమారుడు వరుణ్‌సాయి అన్నారు. నల్లాకులవారిపాలెంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వరుణ్‌సాయి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం పథకాలను వివరించారు. గత ప్రభుత్వాలకు ఈ నాటి ప్రభుత్వానికి తేడాను గుర్తించి మరోకసారి ఆదరించాలని అన్నారు. ఎంపీటీసీ సభ్యుడు నక్కా పాలేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

చాగల్లు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. చిక్కాల పాలెంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల గౌరవధ్యక్షుడు జుట్టా కొండలరావు, అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు సుంకర రాయుడు, శివ, కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్, చిక్కాల సర్పంచ్ మణి, ఎంపీటీసీ తిరుమలరావు పాల్గొన్నారు.

గీతాంజలి కేసులో నిందితుల్ని శిక్షించాలి

కొవ్వూరులో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మహిళలు, ఇతర ప్రజాప్రతినిధులు

కొవ్వూరు: తెనాలిలో గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. కొవ్వూరు పట్టణంలో బుధవారం రాత్రి గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఎమ్మెల్యే వెంకట్రావు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జస్టిస్ ఫర్ గీతాంజలి పేరుతో ఫ్లెక్సీ బ్యానర్ పట్టుకుని పురవీధుల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు, మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీ నాయకులు గీతాంజలిని సోషల్ మీడియా వేదిక చేసుకుని మానసికంగా వేధింపులకు గురి చేయడంతో ఆమె మృతిచెందిందన్నారు. దీనికి కారుకులైన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని వెంకట్రావు డిమాండ్ చేశారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, ముదునూరి నాగరాజు, దొమ్మే రు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, కంఠమణి రమేష్, పరిమి సోమరాజు, వరిగేటి సుధాకర్, బావన రాజేష్, చిట్టూరి అన్నవరం, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, కౌన్సిలర్లు తోట లక్ష్మీప్రసన్న, అంకోలు వెంకటలీల్లి పద్మలీల, దేవగుప్తాపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



కాపవరంలో ఓహెచ్‌ఆర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: నిడదవోలు నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ.72 కోట్లతో ప్రతి గ్రామంలో ఓహెచ్ఆర్ ట్యాంకులు నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు. పెరవలి మండలం కాపవరంలో రూ.75 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను, కొత్తపల్లి అగ్రహారంలో రూ.24.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, సర్పంచ్ బంటుమిల్లి రత్నాజీరావు, ఎంపీటీసీ సభ్యులు మెర్ల వెంకటేశ్వరరావు, నక్కా పాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తానా కార్యదర్శిగా విద్యాధర్ గారపాటి



తానా కార్యదర్శి విద్యాధర్ గారపాటి

చాగల్లు: గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ విద్యాధర్ గారపాటి 2023-25 సంవత్సరాల కాలానికి తానా ఫౌండేషన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన గత 20 సంవత్సరాలకు పైగా న్యూజెర్సీలో ఉంటూ మూవర్స్ డాట్ కామ్, ఎస్‌జీఐ గ్రూపుల అధినేతగా వ్యాపారాల్లో రాణిస్తున్నారు. సేవా, ధాతృత్వం, ల జీవితానికి పరమార్థమని ఆయన తెలిపారు. తానా ట్రస్టీగా అందించిన సేవలకు గుర్తింపుగానే కార్యదర్శిగా ఎన్నికైనట్టు ఆయన చెప్పారు. కోవిడ్ సమయంలో తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవలందించారు. స్వగ్రామైన చాగల్లులో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులకు సహకరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి ఆర్థిక సహకారం అందించారు. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాధర్ తానా కార్యదర్శిగా ఎన్నిక కావడంపై చాగల్లు వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.